క్లుప్తంగా

వీరాంజనేయస్వామికి నింబఫల పూజ



జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారికి విశేషంగా నింబఫల పూజ నిర్వహించారు. ముప్వ మల్లిఖార్జునరావు దంపతులు ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం జరిపించారు. సాయంత్రం విశేషంగా అష్టోత్తర, సహస్ర నామ పూజ పల్లకి ఉత్సవం నిర్వహించారు. భజన సమాజాల వారు హనుమాన్ చాలీసా పారాయణ, భజన కీర్తనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన



అమర్తలూరు(వేమూరు): కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి అన్నారు. అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామం రైతు సేవా కేంద్రంలో పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందితే ఈ పంట నమోదు, పంటల బీమా, అన్నదాత సుఖీభవ పథకం, వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై పంపిణీ చేయు విత్తనాలు, యంత్ర పరికరాలు పొందుటకు అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నెహ్రూబాబు, వ్యవసాయ శాఖ సహాయకులు పిల్లి వెంకటేశ్వర్లు, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి..మరొకరికి గాయాలు



కొల్లూరు: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒక మహిళ చనిపోగా, మరొకరు గాయాలపాలైన ఘటన కొల్లూరు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఆలపాటినగరం నుంచి రూప (36) అనే మహిళ తన 18 ఏళ్ల కుమార్తెతో ద్విచక్ర వాహనంపై అమర్తలూరు వెళుతుంది. కొల్లూరు నుంచి తెనాలి ఇటుక రాయి లోడ్‌తో వెళ్తున్న లారీ ముసలపాడు వద్ద వెనుక నుంచి ఆమె వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ఘటనా స్థలంలోనే రూప మరణించగా, ఆమె కుమార్తె తీవ్ర గాయాలపాలైంది. గాయాలపాలైన యువతిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఉదయం ఘటన జరగగా మృతురాలి బంధువులు శుక్రవారం రాత్రి వరకు మృతదేహంతో ఘటనా స్థలంలోనే ఆందోళన చేపట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు క్రమబద్ధీకరించారు. కొల్లూరు పోలీసు స్టేషన వద్ద రాత్రి మృతురాలి బంధువులతో పోలీసులు చర్చించడంతో ఆందోళన విరమించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయవాడ-చెన్నై రైలు మార్గంలో తెనాలి సమీపంలోని మల్లెపాడు గేటు వద్ద శుక్రవారం సుమారు 35 నుండి 40 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ జి. వెంకటాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలని కోరారు.

రేపు కొల్లిపరలో వైద్య శిబిరం

కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ ఆహార పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు కొల్లిపర మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.భరత్ శుక్రవారం సి.హెచ్.సిలో ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ క్యాంపులో రక్త పరీక్షలు, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆప్తమాలజీ, ఈ.ఎన్.టి, జనరల్ సర్జరీ సంబంధించిన డాక్టర్లు వైద్య శిబిరంలో పాల్గొని రోగులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కావున మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాల్వలు ఇలా.. నీరు పారేదెలా..?!

- పిచ్చి మొక్కలతో నిండిన పంట కాల్వలు
- మురుగు కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్న రైతులు



రేపల్లె ప్రధాన మురుగు తకాల్వ ఓల్డ్ కోర్స్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

నగరం: వ్యవసాయ పనులకు సమయం ఆసన్నమవుతున్నా పంట కాల్వల మరమ్మతు పనులు చేపట్టకపోవడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాల్వల్లో పూడికతీత పనులు నిర్వహించకపోవడం వల్ల ఆయుకట్టు భూములకు సాగునీరందక 30 శాతం మంది రైతులు పంటలకు విరామం(క్రాప్‌హలిడే) ప్రకటించక తప్పడం లేదు. మండలంలో సుమారు 28 వేల ఎకరాలలో పంటలను సాగు చేయాల్సి ఉంది. వీటిలో 70 శాతం పంట కాల్వల్లోని సాగునీటిపై ఆధారపడి పంటలు సాగు చేసేవే అధికం . పంట కాల్వలకు ఆశించిన స్థాయిలో సాగునీరు రాకపోవడం, దీనికి తోడు పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఆయుకట్టు భూములు సాగుకు నోచుకోవడం లేదు. పంట కాల్వలకు మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు ఇటు అధికారులకు, అటు పాలకులకు విన్నవించుకున్నా పనులు మాత్రం ప్రారంభించకోవపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేరుకుపోయిన గుర్రపు డెక్క

మండలంలోని రేపల్లె ప్రధాన మురుగు కాల్వ ఓల్డ్‌కోర్స్, న్యూకోర్స్‌లలో నగరం, తాడివాక వారిపాలెం, దాసరిపాలెం వంతెనల వద్ద గుర్రపుడెక్క విపరీతంగా పేరుకుపోయింది. వేసవిలో నీటి ప్రవాహం లేకపోవడంతో గుర్రపు డెక్క ఏపుగా పెరిగింది. గుర్రపు డెక్క ఇలానే ఉంటే భవిష్యత్‌లో ఇబ్బంది తలెత్తే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పిచ్చిమొక్కలతో నిండిన పంట కాల్వలు

మండలంలో అధిక శాతం పంటలకు వెల్లటూరు కెనాల్, పూడివాడ బ్రాంచ్ కెనాల్ నుంచి సాగునీరు రావాల్సి ఉంది. ఈ పంట కాల్వలు నుంచి పెద్దవరం, తోటపల్లి, పమిడిమర్రు, అద్దంకివారిపాలెం, ధూళిపూడి, ఏలేటిపాలెం, నగరం, ఈదుపల్లి, పూడివాడ తదితర గ్రామాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే ఈ కాల్వల్లో 50 శాతం కాల్వలు పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండి ఉన్నాయి. దీంతో ఆయకట్టు భూములకు నీరందక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాల్వలకు నీరు రాకపోవడంతో కొంత మంది రైతులు వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. దీంతో ఆశించిన దిగుబడులు రాక నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. చివరి భూముల రైతులు మాత్రం పంటలకు విరామం ప్రకటిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పంట కాల్వలకు మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



నగరం మండలంలోని పంట కాల్వలో పెరిగిన చెట్లు, మట్టి నిల్వలు

సమస్యలు తెలుసుకునేందుకే 'పల్లె పడక'

రేపల్లె : ప్రజా సమస్యలను తెలుసుకునే లక్ష్యంతో పల్లె పడక కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లువైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం రాజ్యసభ సభ్యులు, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జునలతో భేటీ అయి పల్లె పడక కార్యక్రమం ఉద్దేశంను వివరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. గ్రామాలలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల చెరుకుపల్లి మండలం బాప్టిస్ట్‌పాలెంలో నిర్వహించిన పల్లె పడక కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ప్రజలు సమస్యలను స్వచ్ఛందంగా తెలియజేస్తూ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వెళ్లగక్కుతున్నారన్నారు. త్వరలో నగరం మండలంలో పల్లె పడక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను ఆయన వారికి వివరించారు.



పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల, మాజీ మంత్రి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగుతో డాక్టర్ గణేష్

భవితతో చిన్నారులకు ఉత్తమ భవితవ్యం

సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ మట్ట జ్యోత్స్న

రేపల్లె : ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించి వారికి భవిత స్కూలు ద్వారా విద్యాబుద్ధుల్ని అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ మట్ట జ్యోత్స్న తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష ఆదేశానుసారం భవిత సిబ్బంది ఆధ్వర్యంలో రేపల్లె పట్టణ, మండలంలో నిర్వహిస్తున్న 0 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించి అనంతరం మాట్లాడారు. మానసిక వైకల్యం కలిగిన చిన్నారులకు భవిత స్కూలులో ఆట పాటలతో కూడిన విద్యను అందించి వారిని సాధారణ విద్యార్థుల వలె తీర్చిదిద్దటం జరుగుతుందన్నారు. విద్యబుద్ధులతో పాటు ఫిజియోథెరపీ, ఆటలలో ప్రత్యేక శిక్షణ అందించబడునన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులు ఎటువంటి వైకల్యానికి గురైన భవిత కేంద్రంలో గానీ, సర్వేకు వచ్చిన భవిత సిబ్బందికి గానీ వివరాలను తెలియజేసి సహకరించాలన్నారు. వినికిడి, దృష్టి లోపం, బుద్ధి మాంద్యం, ఆటిజం, శారీరక వైకల్యం వంటి 21 రకాల లోపాలు ఉన్న చిన్నారులను గుర్తించి సమాచారం సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వే జూన్ వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ అనురాధ పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న భవిత స్కూల్ స్పెషల్ ఎడ్యుకేటర్ అనురాధ

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

ఏవో బాలాజీ గంగాధర్

చెరుకుపల్లి: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలైన జీలుగ, జనుము అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ శుక్రవారం తెలిపారు. ఒక కేజీ జీలుగ రూ.123 కాగా సబ్సిడీపై రూ.61.50, అదే విధంగా జనుము పూర్తి ఖరీదు రూ.109 కాగా సబ్సిడీపై రూ.54.50కు అందిస్తున్నట్లు ఏవో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావల్సిన రైతులు పొలం పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్సు తీసుకొని ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. అదే విధంగా మండలంలోని కనగాల, ఆళ్ళవారిపాలెం గ్రామల్లో కౌలు గుర్తింపు కార్డులపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.



కనగాలలో కౌలు గుర్తింపు కార్డులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో బాలాజీ గంగాధర్

తాగటానికి నీళ్లు ఇప్పించండి

జగనన్న కాలనీవాసుల నిరసన

రేపల్లె : తాగటానికి గుక్కెడు మంచినీళ్లు ఇప్పించండి అంటూ పట్టణంలోని జగనన్న కాలనీ వాసులు శుక్రవారం కాలనీలో ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన వ్యక్తం చేశారు. తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిరసన కార్యక్రమాన్ని సందర్శించిన సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో 1000 మందిపైగా గృహాలు నిర్మించుకొని నివాసం ఉంటున్న కనీస వసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. తాగునీరు అందక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నట్లు నెల రోజుల నుంచి పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. కాలనీలో ఉన్న బోర్లు పాడవటంతో నీటి కోసం కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగనన్న కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ ధనమ్మ, సభ్యులు ఆశీర్వాదం, నాంచారమ్మ, పిచ్చయ్య, వీరాంజనేయులు, గౌస్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న జగనన్న కాలనీవాసులు

దోమలతోనే వ్యాధులు వ్యాప్తి



ర్యాలీలో వైద్య సిబ్బంది



మొళ్లగుంటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది



కూచినపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రేపల్లె : జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓల్డ్‌టౌన్‌లోని అర్బన్ హెల్త్ సెంటరులో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎన్.సారంగపాణి ప్రారంభించి మాట్లాడారు. దోమలతో అనేక రకాల అంటు వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తూ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. పనికిరాని వస్తువులను పడవేయాలన్నారు. ఇంటి పై ఉండే వాటర్ ట్యాంకులకు మూతలు ఉండేటట్లు చూడాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ గ్యాస్ పైపులకు నెట్స్ అమర్చుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ ఎం.ఎల్లయ్య, హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె: ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శ్రావణ్య అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొళ్లగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈడెస్ జాతికి చెందిన దోమ కుట్టడంతో సంక్రమించే డెంగీ జ్వరం ప్రమాదకరమన్నారు. వ్యాధి బారిన పడిన వారిలో తీవ్ర జ్వరం, తలనొప్పి, వాంతులు, కండరాలు, కీళ్ల నొప్పులు, చర్మంపై దద్దుర్లు కనిపిస్తాయని చెప్పారు. ఆరోగ్యం మెరుగుపడటానికి సాధారణంగా రెండు నుంచి ఏడు రోజులు పడుతుందని తెలిపారు. ఇటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యుడిని సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. దోమల నివారించటంతో వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. నివాస గృహాల సమీపంలో నీటి నిల్వలు, తేమ వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు. తేమ వాతావరణంలో దోమల ఉధృతి అధికంగా ఉండేందుకు అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సాయి, సూపర్‌వైజర్లు వైవీ రావు, రంగారావు, ప్రేమ కుమారి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



కర్లపాలెంలో అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

దోమ కాటు ఆరోగ్యానికి చేటు

నిజాంపట్నం: దోమ కాటు ఆరోగ్యానికి చేటు అని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నాగార్జున చెప్పారు. జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దోమల నిర్మూలనకు వ్యక్తిగత జాగ్రత్తలతో పాటు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం అన్నారు. తీవ్రమైన జ్వరం, కండరాలు, కీళ్ల నొప్పులు, దద్దుర్లు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. నివాస గృహాల చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మురుగునీటి నిల్వలు, తడి ప్రాంతాలలో దోమల వృద్ధి అధికంగా ఉంటుందన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మురళి, పర్యవేక్షకులు సాంబశివ రావు, లక్ష్మి, మాధవి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

కర్లపాలెం: డెంగీ వ్యాధి పట్ల అందరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎస్‌కే సుహానా బేగం చెప్పారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం కర్లపాలెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కర్లపాలెం వైఎస్సార్ మార్కెట్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ర్యాలీలో డాక్టర్ సుహానా బేగం మాట్లాడుతూ దోమ కాటు వలన డెంగీ లాంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని చెప్పారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ ప్రభావతి, హెచ్‌వీ ప్రభావతి, సూపర్‌వైజర్ ఇసాక్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తూకం, ప్యాకింగ్‌లకు నిబంధనలు తప్పనిసరి

లీగల్ మెట్రాలజీ శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎస్ మాధురి

తెనాలి: దాల్‌మిల్లుల యాజమాన్యం తూకం, ప్యాకింగ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని లీగల్ మెట్రాలజీ శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎస్ మాధురి స్పష్టంచేశారు. గుంటూరు, తెనాలి, వినుకొండలోని దాల్‌మిల్స్ అసోసియేషన్లకు శుక్రవారం స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 20న ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ సౌరభ్‌గౌర్ ఆదేశాలతో ఈనెల 8వ తేదీనుంచి 20వ తేదీ వరకు తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో వర్తకసంఘాలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని దాల్‌మిల్స్ అసోసియేషన్లతో ఏర్పాటైన సదస్సుకు అధ్యక్షత వహించిన జాయింట్ కంట్రోలర్ మాధురి మాట్లాడుతూ, దాల్‌మిల్లుల్లో ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌ను ఏటా విధిగా లీగల్ మెట్రాలజీచే ధృవీకరించుకోవాలని సూచించారు. ప్యాకేజ్డ్ కమోడిటీస్ రూల్స్, 2011 ప్రకారం 25 కిలోలలోపు ప్యాక్ చేసిన బ్యాగ్స్‌పై ఉండాల్సిన డిక్లరేషన్స్‌ను తెలియజేశారు. ప్యాక్ చేసిన వస్తువు సాధారణ పేరు, తయారీదారు పూర్తి చిరునామా, వస్తువు నికర బరువు, తయారీ నెల, సంవత్సరం, వస్తువు గరిష్ట చిల్లర ధర, కస్టమర్ కేర్ ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీ, యూనిట్ సేల్ ప్రైస్‌ను విధిగా ముద్రించాలని చెప్పారు. 25 కిలోలకన్నా పై ప్యాకింగుల్లో ప్యాక్ చేసిన వస్తువు పేరు, తయారీదారు పూర్తి చిరునామా, నికర బరువు ఉండాలని, ఎవరైతే ప్యాకింగ్ చేస్తున్నారో వారు లీగల్ మెట్రాలజీ శాఖచే ప్యాకర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరించారు. లీగల్ మెట్రాలజీ గుంటూరు, పల్నాడు జిల్లాల అసిస్టెంట్ కంట్రోలర్లు జి.కొండారెడ్డి, ఎస్.అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్లు జీఎస్ సునీల్‌రాజు, బి.శేషసాయి, జి.సాయిశ్రీకర్, షేక్ జానాసైదా, దాల్ మిల్స్ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాధురి

చిరస్మరణీయుడు సంగీత కళాకారుడు పెద్దిరాజు

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత కళాకారుడు తాడివలస వెంకట పెద్దిరాజు సంతాపసభను శుక్రవారం సాయంత్రం గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' హాలులో నిర్వహించారు. అభ్యుదయ కళా సమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఇస్కఫ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సభకు నటుడు, గాయకుడు బెల్లంకొండ వెంకట్ అధ్యక్షత వహించారు. కళ కళకోసం కాదు..ప్రజల కోసం అనే నినాదంతో కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రదర్శనలకు పెద్దిరాజు సంగీత సహకారం అందించారని వెంకట్ గుర్తుచేశారు. వివిధ పోటీల్లో బహుమతులు అందుకున్నారని చెప్పారు. టి.రామారావు బ్యాండ్ గ్రూపుతో రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లోనూ ప్రదర్శనలిచ్చారని, పలు నాటకాల్లో నటించారని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించిన 'కళాజాత'లోనూ సహకారం అందించారని చెప్పారు. తొలుత పెద్దిరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తబలా నాగప్రసాద్, సంగీత కళాకారులు విజయసారథి, ఎస్‌కే సుభాని, అలపర్తి వెంకటేశ్వరరావు, ఎస్‌కే సైదా, టి.జగపతి, జి.ప్రకాష్, వి.వాసుకుమార్, వి.శ్రీనివాస్, జి.సుధీర్, బి.కృష్ణ పాల్గొన్నారు.



చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సభ్యులు

హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన



పట్టణంలో కళాజాతర నిర్వహిస్తున్న కళాకారులు

తెనాలిటౌన్: హెచ్ఐవీ ఎయిడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నవచైతన్య కళామండలి నిర్వాహకులు కృష్ణ కిషోర్ ప్రజలకు సూచించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నవచైతన్య కళా మండలి కళా బృందంతో వీధి నాటకాల ద్వారా హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ముఖ్య కూడళ్లలో కళాజాతర నిర్వహించారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత చూపరాదని, ఎయిడ్స్ నివారణకు పాటించాల్సిన నియమాలను తెలియజేశారు. విచ్చలవిడి శృంగారం ఎయిడ్స్‌కు దారి తీస్తుందని సూచించారు. కార్యక్రమంలో సిరి మహిళా సాధికారిత వెల్ఫేర్ సొసైటీ తెనాలి ప్రాజెక్టు మేనేజర్, ఎంఅండ్‌డీ, డీఎస్ఎం, ఓఆర్‌డబ్ల్యూవో ఎడ్యుకేటర్, కళాకారులు పాల్గొన్నారు.

అధ్యాపకుడు జయపాల్‌కు పీహెచ్‌డీ ప్రదానం



జయపాల్ బాబు

తెనాలిఅర్బన్: మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు, తెనాలి ఐతానగర్ వాసి మదిరా జయపాల్‌బాబు నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆంధ్ర లయోలా కళాశాల చరిత్ర రీడర్ డాక్టర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో షెడ్యూలు తెగల ప్రాథమిక విద్య-ప్రగతి, ప్రభుత్వ కృషి చారిత్రాక పరిశీలన, తూర్పు గోదావరి జిల్లా ప్రత్యేక అనుబంధం అనే అంశంపై రీసెర్చ్ చేసినట్లు తెలిపారు. ఆయన పరిశోధన రికార్డులను పరిశీలించి నాగార్జున యూనివర్శిటీ ఆయనకు పీహెచ్‌డీ ప్రదానం చేసింది. కళాశాల కరస్పాండెంట్ వీవీ తాతారావు, ప్రిన్సిపల్ డాక్టర్ వై.నాగేశ్వరరావు, యోగ గురువు ఎ.వెంకటేశ్వరయోగి, అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఎస్టీ మహిళ అంత్యక్రియలకు పెన్నీ మినిస్ట్రీస్ తోడ్పాటు

తెనాలి: రూరల్ మండలం కొలకలూరులో కొమ్మమూరు కాల్వకట్టపై జీవిస్తున్న యానాది సామాజికవర్గానికి అంత్యక్రియలు సమస్యగా మారాయి. ప్రత్యేకంగా వారికి శ్మశానం లేకపోవటంతో కాల్వగట్టుపైనే భూస్థాపితం చేస్తుండేవారు. కాల్వకట్ట ఆక్రమణలకు గురవటంతో, గురువారం అనారోగ్యంతో మృతి చెందిన తలపల సీతమ్మ అంత్యక్రియలకు సమస్య ఎదురవగా వారికి ఎంతోకాలంగా నిత్యావసరాలు సమకూర్చుతూ, రేషన్, ఆధార్ కార్డులు వచ్చేందుకు సహకరిస్తున్న పెన్నీ మినిస్ట్రీస్‌ను సంప్రదించారు. సంస్థ వ్యవస్థాపకుడైన సినీదర్శకుడు దిలీప్‌రాజా అక్కడకు చేరుకుని, సీతమ్మ అంత్యక్రియలకు చొరవచూపారు. యానాదులకు నివాస వసతి సమకూర్చాలని అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.